క్లుప్తంగా

బాలాజీనగర్ ఎస్సైగా పుల్లారెడ్డి



నెల్లూరు(క్రైమ్) : బాలాజీనగర్ ఎస్సైగా ఎం.పుల్లారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన స్థానిక ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావు, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో పుల్లారెడ్డి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు.

చిత్రకళను ప్రోత్సహించాలి



నెల్లూరు(బృందావనం) : భారతీయ చిత్రకళను సమాజం ప్రోత్సహించాలని 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అన్నారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో ఏర్పాటు చేసిన 'కలర్స్ ఆఫ్ నెల్లూరు ఎడిషన్ 3 ఆర్ట్ ఎగ్జిబిషన్'ను శనివారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఈ ప్రదర్శనను నెల్లూరీయులు తిలకించి ఆదరించాలన్నారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు తాళ్లపాక రమేష్‌రెడ్డి విచ్చేసి చిత్రకారులు అమీర్‌జాన్, ఎం.సుందరబాబు, బి.శేషయ్యలు తీర్చిదిద్దిన 30 ఎన్టీఆర్ చిత్రాలను వీక్షించి అభినందించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పవన్‌రెడ్డి, అందె శ్రీనివాసులు, కేఎస్ నరసయ్య, దోర్నాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవం



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో ఆరాధనోత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు త్యాగరాజస్వామికి అభిషేకం, నామార్చనలు జరిపారు. అనంతరం భక్తబృందంచే భిక్షాటన, నగర సంకీర్తన చేపట్టారు. బ్రహ్మశ్రీ మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. కార్యక్రమాన్ని త్యాగరాజ సేవా సమితి నిర్వాహకులు పర్యవేక్షించారు.

విద్యార్థినికి అభినందన



నెల్లూరు (టౌన్) : వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2025కు నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని నామాల కావ్యాంజలి ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయ శర్మ తెలిపారు. ఈ మేరకు స్థానిక నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినిని శనివారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి, ఈసీఈ హెచ్‌ఓడీ మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మాబాబా వర్ధంతి



చిన్నారుల నృత్య ప్రదర్శన

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకుడు ప్రజాపిత బ్రహ్మాబాబా వర్ధంతిని శనివారం నిర్వహించారు. సమాజంలో శాంతి, ఆధ్యాత్మిక చింతన వ్యాప్తికి ప్రజాపిత బ్రహ్మాబాబా అనుసరించిన జీవన విధానాన్ని కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మకుమారీలు బీకే ప్రసన్న, సుమతి, నిర్మల అక్కయ్య వివరించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నిధుల కేటాయింపు శుభపరిణామం

నెల్లూరురూరల్ : విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.11,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించడం శుభపరిణామమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడారు. ఏపీ అభివృద్ధికి ప్రధాని మోదీ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాల్ ఖాజామస్తాన్ కపూర్, శౌరి శ్రీనివాస్, మోతిసింగ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేమింతే.. మారమంతే..

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నా వాహనచోదకుల్లో మార్పు రావడం లేదు. పరిమితికి మించిన ప్రయాణం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లో ప్రయాణం, హెల్మెట్‌ధారణ వంటి వాటిపై చేస్తోన్న సూచనలను పెడచెవిన పెట్టి ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు. ఓ వైపు రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై రవాణా, పోలీసు అధికారులు విస్తృత అవగాహన కల్పిస్తున్నా.. ఇవేమీ తమకు పట్టవంటూ వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నెల్లూరు నగరంలో శనివారం ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తూ రాకపోకలు సాగిస్తున్న దృశ్యాలను సాక్షి క్లిక్‌మనిపించింది.

– నెల్లూరు(క్రైమ్)



రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనదారులు



బైక్‌పై ట్రిపుల్ రైడింగ్



పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటో





సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న వాహనచోదకులు



హెల్మెట్ లేకుండా ప్రయాణం

పుడమిని కాపాడుకోవడం అందరి బాధ్యత

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- పరిసరాలను శుభ్రం చేసిన అధికారులు

నెల్లూరు (పొగతోట) : పుడమి తల్లిని కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని జెడ్పీ సీఈఓ విద్యారమతో కలిసి ఆమె శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెట్లను పెంచడం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. మన భూమిని మనం నాశనం చేసుకుంటే అనారోగ్య సమస్యలు మొదలవుతాయన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా భూమిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి జీవికి జీవనాధారం ప్రకృతేనన్నారు. గ్లోబల్ వార్మింగ్, అడవులను నరికివేయడం, గాలి కాలుష్యం, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. మానవ మనుగడ సాగించేందుకు పర్యావరణ పరిరక్షణ అత్యంత ముఖ్యమన్నారు. ప్రతిఒక్కరూ చెట్లు నాటి వాటిని పెంచి కాపాడుకోవాలన్నారు. వాహనాల వినియోగాన్ని తగ్గించడం ఎంతో అవసరమన్నారు. భూమికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

డ్వామా కార్యాలయంలో..

డ్వామా, డీఆర్‌డీఏ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమాలు నిర్వహించారు.



జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కకు నీరు పడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

డ్వామా పీడీ గంగా భవానీ, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

కలెక్టరేట్‌లో..

నెల్లూరురూరల్ : నగరంలోని కలెక్టరేట్‌లో డీఆర్వో ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వీధులు, డ్రెయినేజీలు, నీటి వనరులు, వాటర్ ట్యాంకులు, కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఏఓ విజయ్‌కుమార్, జిల్లా ఖజానాధికారి గంగాద్రి, డీసీఓ గుర్రప్ప, సీపీఓ నరసింహులు, డీపీ ఆర్‌ఓ సదారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో..

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, పలువురు డాక్టర్లు పరిసరాల్లోని చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత వల్ల పలురకాల జబ్బులు దూరమవుతాయన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో..

నెల్లూరు(బారకాసు) : పర్యావరణ పరిరక్షణలో సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించాలని మెప్మా పీడీ రాధమ్మ అన్నారు. నగరంలోని మెప్మా కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పీడీ పాల్గొన్నారు. తొలుత కార్యాలయ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో..

నెల్లూరు(క్రైమ్) : పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంతో పాటు ఎస్పీ క్యాంప్ ఆఫీస్, ఎస్‌బీ, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో అధికారులు, సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఎల్లప్పుడూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా పోలీసులు సిబ్బందికి సూచించారు.

డీసీఓ ఆధ్వర్యంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : స్థానిక డీసీఓ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో డీసీఓ గుర్రప్ప పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

నెల్లూరు(అర్బన్) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుజాత అన్నారు. స్థానిక సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలు, కంపచెట్లను స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తొలగించారు. కార్యక్రమంలో డాక్టర్ దయాకర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు తదితరులు పాల్గొని, చెత్తను తొలగించారు.



బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్ వద్ద..



కలెక్టరేట్ ఆవరణలో..



పెద్దాస్పత్రి ఆవరణలో..



మెప్మా కార్యాలయ ప్రాంగణంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణలో..



డీసీఓ కార్యాలయ ఆవరణలో..

రవాణా కార్యాలయంలో వైద్య పరీక్షలు



నెల్లూరు (టౌన్) : రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో రెయిన్‌బో ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీఓ సిరి చందన, ఎంవీఐలు ఎండీ రఫీ, కార్తీక్, ఏఎంవీఐలు స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, ఏఓ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆపన్నహస్తం



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వాకాడు డీసీసీ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్సార్ శ్రీధర్ గతనెల 20వ తేదీన అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న డీసీసీడీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కుమార్‌పాల్ అసోసియేషన్ సభ్యుల ఒకరోజు వేతనాన్ని మృతుని కుటుంబానికి అందజేయాలని నిర్ణయించారు. ఈ మేరకు డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు శనివారం తన కార్యాలయంలో రూ.1.69,002 నగదు చెక్కును మృతుని భార్య కార్తీకకు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ జనరల్ మేనేజర్ సరిత, అసోసియేషన్ నాయకులు గౌస్‌బాషా, సల్మాన్, గాయత్రి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించండి



హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : పీఎం సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ విజయన్ అన్నారు. నగరంలోని కోటమిట్టలో ఉన్న విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో వినియోగదారుల హెల్ప్‌డెస్క్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోలార్ విద్యుత్‌పై అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు అశోక్, సునీల్, కిరణ్, ఏఈఈ సురేఖ, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



మృతుని కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్ అందజేత

నెల్లూరు(అర్బన్) : నగరంలోని మైపాడు గేట్ సమీపంలో ఉన్న మారుతీనగర్ వాసి పాలమడి హజరత్తయ్య(75) శనివారం వేకువజామున గుండెపోటుతో మృతిచెందారు. నేత్రదాన మోటివేటర్లు కిశోర్‌కుమార్, బాలాజీల సహకారంతో కుటుంబ సభ్యులు మృతుని నేత్రాలను జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. దీంతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ మృతుని నేత్రాలను సేకరించారు. అనంతరం కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేయదలచిన వారు 99595 89321(సునీల్), 99898 50506(కిశోర్‌కుమార్), 93471 11033(బాలాజీ)లను సంప్రదించాలని కోరారు.

షాపులకు వేలంపాట రేపు

నెల్లూరు(సెంట్రల్) : నగరంలోని మద్రాసు బస్టాండు సమీపంలోని కోనేరులో నిర్మించిన షాపులకు ఈనెల 20వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ బ్లాక్‌లో 60, బీ బ్లాక్‌లో 52, సీ బ్లాక్‌లో 28 షాపులకు వేలంపాట జరుగుతుందన్నారు. షాపులకు సంబంధించి దరఖాస్తులు చేసుకున్న వారు హాజరు కావాలని కోరారు.

కేన్సర్‌పై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

నెల్లూరు(అర్బన్) : గర్భాశయ ముఖద్వారపు(సర్వికల్) కేన్సర్‌పై తప్పనిసరిగా అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి అన్నారు. స్థానిక పొదలకూరు రోడ్డులోని కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో మహిళలకు ఉచిత సర్వికల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ స్త్రీలలో వచ్చే కేన్సర్లలో గర్భసంచి ముఖద్వారపు కేన్సర్ రెండో స్థానంలో ఉండడం బాధాకరమన్నారు. దీనిపై తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, రేడియేషన్ అంకాలజిస్ట్ గీతాఉషశ్రీ, సర్జికల్ అంకాలజిస్ట్ ముత్తు, పెథాలజిస్ట్ నందిత, జనరల్ మేనేజర్ భక్తవత్సలరెడ్డి, పేషంట్ కౌన్సిలర్ కన్యాకుమారి, ఎంసీ మెంబర్ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరు (పొగతోట) : పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ 2025 క్యాలెండర్, డైరీని స్థానిక పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకులు బాబురావు, లక్ష్మీనారాయణ, ఈఈలు సుబ్బరాజు, సత్యనారాయణరెడ్డి, చంద్రారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

బొందిలి సంఘ రాష్ట్ర సమావేశం నేడు

నెల్లూరు(బృందావనం) : బొందిలి సంఘ రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఆదివారం నగరంలోని ఏఎల్‌రావు కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు జరుగనుందని జిల్లా బొందిలి సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శ్రీనివాస్‌సింగ్, ఎ.నాగేంద్రసింగ్, తరుణ్‌సింగ్, శ్రీధర్‌సింగ్‌లు శనివారం తెలిపారు. ముఖ్యఅతిథులుగా సంఘ తెలంగాణ అధ్యక్షుడు రవీంద్రనాథ్‌సింగ్, తమిళనాడు అధ్యక్షుడు జైసింగ్, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు ఎస్.కృష్ణసింగ్‌లు రానున్నారన్నారు.

పోస్టర్ విడుదల



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జనార్దన్‌రెడ్డికాలనీలోని సీపీఐ కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలకు చెందిన పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ మున్నా కోరారు.